"సరేలే. వీలుచేసుకుంటాను ఉమా. చూడు- నీతో ఒకమాట చెప్పాలి- సామాను రెడీగావుంచి నీవు బయటకి వచ్చెయ్యి. ఆమెను రకరకాల ప్రశ్నలు వెయ్యకు."

"మంచిది, వుంటాను. అవసరమయితే మళ్ళీ ఫోనుచేస్తాను" ఫోను పెట్టేసింది ఉమ.

రమేష్ యింటికిరాగానే ఉమ సామాన్ల లిస్టు చేతికిచ్చి పరుగెత్తించింది. మరునాడు సామాను బాగుచేయించి వంటయింట్లో పెట్టింది. గిన్నెలు తోమించింది. తాను కాఫీ టిఫెన్ భోజనాలయింట్లో చేసింది.

పద్మ కిందటిరోజు వచ్చినట్టుగానే స్టైయిలుగా వచ్చింది. ఆమెవెంట ఇద్దరు మగవాళ్ళను తీసుకువచ్చింది. తాను వెంట తీసుకువచ్చిన సంచీతో బాత్ రూమ్‌లోకి వెళ్ళి చీరెమార్చుకుని సంచిలో పెట్టుకుని బైటికివచ్చింది. మగవాళ్ళలో ఒకరిని పిండిపిసకమని చెప్పింది. మరొకరు పళ్ళతొనలలోనుంచి గింజలు, పొట్టు తీస్తున్నాడు. అంతలో మొదటి అతడు వుండలుచేయగానే పాకం పట్టింది. వుండలు వేయించి పాకంలోవేసింది. రెండుగంటలకు పైగా అయింది బాదుషాలు చేయటానికి. పెద్ద పెద్ద గంపల్లో కాగితాలువేసి బాదుషాలు పేర్చిపెట్టింది.

ముగ్గురూ కలిసి పళ్ళన్నీ శుభ్రంచేసి దానిలో వేయవలసిన వస్తువులువేసి రెండు పెద్దగిన్నెలలో డ్రింక్ తయారుచేశారు అన్నీ ఒకపక్కకుపెట్టి ఇల్లు కడిగి తుడిచి బయటపంపుదగ్గర వాళ్ళు స్నానాలుచేసి డ్రెస్సులు వేసుకున్నారు. పద్మకూడా స్నానంచేసి వచ్చేటప్పుడు కట్టుకున్న చీరే కట్టుకుని, తలముడి సవరించుకుని, పౌడరువేసుకుని, తిలకం దిద్దుకుని బైటికివచ్చింది. హాండ్‌బాగ్ చేతికి తగిలించుకుంటూ "వస్తానండీ" అంటూ వాళ్ళతో గేటుదాటింది.

మరునాడు పెద్ద పెట్టెలాంటి ఓవెన్ తీసుకువచ్చింది. కేక్‌కోసం అన్ని వస్తువులూ వేసి, మైదా, కోడిగుడ్లరసం, మెత్తటి చక్కెర కలిపే మిషన్‌తో కలిపించింది. ట్రేలలోపెట్టి ఓవెన్‌లో ఈ ట్రేలు ఎక్కించింది. ఎలక్ట్రిక్ కనెక్షను యిచ్చింది. అది అటు అవుతూవుండగా మగవాళ్ళిద్దరూ ఒకరు పిండికలిపి పిసికారు. ఒకరు కూర తయారుచేశారు. మిఠాయిపొట్లాంలా తయారుచేసిన సగం పూరీతో కూరనింపి ఒకరందిస్తే ఆమె సమపాళంగా వేయించిపోసింది. కాస్త ఆర

గానే గంపలకెత్తి కాగితాలు కప్పారు. కేక్ తయారయినట్టు వాసనరాగానే ఎలక్ట్రిక్ కనెక్షన్ తీసింది పద్మ. అయిదు పెద్ద పెద్ద కేకులు తయారయ్యాయి. వాటిమీద రంగు రంగుల చిన్న చిన్నపూలు 'హేపీ బర్తుడే' ఐసింగ్‌చేసి అలంకరించింది.

కిందటి రోజులాగానే అక్కడంతా శుభ్రపరచి స్నానాలుచేసి వచ్చేటప్పుడు వేసుకున్న డ్రెస్సు వేసుకుని బైటికివచ్చారు. పద్మమాత్రం కూల్ డ్రింక్‌లో ఎన్ని నీళ్ళు కలపాలో కలిపి, మంచుగడ్డలు వెయ్యమని చెప్పి ఓవెన్ డబ్బా రిక్షాలో ఎక్కించి వాళ్ళతో పంపించింది. బాగ్‌లోనుంచి కాగితం పెన్సిల్ తీసుకుని బిల్లు రాసి ఉమకిచ్చి వెళ్ళిపోయింది.

ఆమె గేటు దాటకముందే ఉమ నాలుగడుగుల్లో ఆమెను కలుసుకుని "పద్మగారూ ఆరుగంటలకు పార్టీ అనుకున్నాం. మీరు తప్పకుండా రావాలి" అని చెయ్యిపట్టుకుంది.

సరేనంటూ నవ్వుకుని వెళ్ళిపోయింది పద్మ.

ఉమ ఒకసారి వంటయింట్లోకి వెళ్ళి మళ్ళీ పదార్థాలన్నీ కంటితోచూసింది. తల్లీ తనూ కలిసి రుచికూడా చూశారు.

"ఆవిడ దగ్గరేవుండి చేయించి వుంటుంది" అన్నది సుందరమ్మ.

ఉమకుమాత్రం ఆవిడకూడా చేసే వుంటుందన్న అనుమానం తగిలింది. కాని ఎవరితోనూ అనలేదు.

నాలుగుగంటలనేపునుంచి రమేష్ షామియానా క్రింద కుర్చీలు, బల్లలు సర్దటంలో మునిగిపోయాడు. అతడితో ఇద్దరు అసిస్టెంట్లు పనిచేశారు. ఎనిమిది మంది సర్వర్లు వచ్చారు.

సాయంకాలం ఆరుగంటలవుతూ వుండగా ఒక్కొక్కరే పిలిచినవాళ్ళంతా రావటం మొదలుపెట్టారు. సరిగ్గా ఆరున్నరగంటలకు పాపచేత చాకు పట్టించి కేక్ కోయించారు. వెలిగించిన కేండిల్ ఆర్పారు పాపకు కేక్‌ముక్క ఒకటి చేతి కిచ్చారు. తండ్రీ తల్లీ చెరొకముక్క తమనోళ్ళలో పెట్టించుకున్నారు పాపచేత.

సర్వర్లు ప్లేట్లునింపితూవుంటే వచ్చినవాళ్ళు ఖాళీచేస్తువచ్చారు. డ్రింక్సు తీసుకుంటున్నారు.

